క్లుప్తంగా

న్యాయవాదికి భూమన నివాళి



శ్రీధర్ మృతికి నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: సీనియర్ న్యాయవాది శ్రీధర్ ఆకస్మిక మృతికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం శ్రీధర్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, తిరుమల రెడ్డి, చిన్నా

తిరుపతి కల్చరల్: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక దాము జన్మదినం సందర్భంగా తాళ్లపాక లక్ష్మీనారాయణ ఆటో యూనియన్ అధ్యక్షుడు చిన్నా ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఆటో స్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నదానం ప్రారంభించారు. దీనికి ముందు కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నేతలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సాయిసుధాలో కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీ సాయిసుధా కంటి ఆసుపత్రిలో గురువారం ఉచిత రెటీనా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి వైద్య పరీక్షలను నిర్వహించారు. 50 మందికి రెటీనా పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి వచ్చే ప్రమాదం ఉందన్నారు. మధుమేహం ఉన్నవారు అప్పుడప్పుడు రెటీనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తంలో చక్కెర స్థాయి పెరిగినప్పుడు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించి అందరూ సకాలంలో వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది హిమ బిందు, గీతా, సునీత, మహేష్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అధ్యక్షుడికి అభినందనలు



తిరుపతి తుడా: ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ పురుషోత్తమనాయుడులను ఆ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్జీవో తిరుపతి సెక్రటరీ బాలాజీ, తోట చిట్టిబాబు తదితరులు పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ క్లాసులు

- గిరిజన గురుకులాల సెక్రటరీ సదా భార్గవి



తిరుపతి ఎడ్యుకేషన్: విద్యార్థినులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు పట్టుదలతో శ్రమించాలని గిరిజన గురుకులాల సెక్రటరీ సదా భార్గవి పిలుపునిచ్చారు. గురువారం ఆమె ముత్యాలరెడ్డిపల్లెలో గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో ముచ్చటించారు. గురుకులంలో వసతులు ఎలా ఉన్నాయి, విద్యాబోధన ఎలా ఉంది, ఇతరత్రా వాటిపై ఆరా తీశారు. తమకు అన్నీ బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులకు మార్గదర్శనం చేస్తూ, సివిల్ సర్వీసెస్, ఐఐటీ, జేఈఈ వంటి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా సంసిద్ధులు కావాలన్నారు. విద్యార్థులు కోరితే దీనికి సంబంధించి ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించడంతోపాటు మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. పదో తరగతి విద్యార్థినులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ ఎస్.రత్నప్రభ, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

- శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్ద ప్రారంభించిన టీటీడీ చైర్మన్ భూమన



అన్నప్రసాదాలు వడ్డిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ.ధర్మారెడ్డి



నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ.ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శ్రీగోవిందరాజ స్వామి ఆలయం వద్దనున్న పాత మ్యూజియంలో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తిరుమలలో ప్రతి రోజూ లక్ష మంది భక్తులు నిత్యాన్నదాన పథకం ద్వారా భోజనం చేస్తున్నారన్నారు. గతంలో తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుమల వచ్చిన ప్రతి భక్తుడూ అన్నదానంలో భోజనం చేసే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అదే సమయంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద కూడా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆరంభించామన్నారు. ప్రస్తుతం తిరుమలలో తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, పీఏసీలు తదితర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఒంటిమిట్టలో కూడా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. తన చిన్నతనంలో సాయంత్రం పూట ఇక్కడ అన్నప్రసాదం కోసమని వచ్చిన సందర్భాలు ఉన్నాయని, తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్నారు. టీటీడీ చైర్మన్‌గా శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రతి రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు వేల మంది భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఈ అన్నదాన కార్యక్రమాన్ని మరింతగా విస్తరించనున్నట్లు తెలిపారు. అనంతరం చైర్మన్, ఈవో కలిసి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. టీటీడీ అందిస్తున్న అన్నప్రసాదాల రుచి, నాణ్యత గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలపైభక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, సీవీఆర్వో డాక్టర్ టి.రవి, డెప్యూటీ ఈవోలు శాంతి, రాజేంద్రకుమార్, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల పాలిట 'కరుణ

- టీటీడీ చైర్మన్ భూమనకు కృతజ్ఞతలు తెలిపిన టీటీడీ ఉద్యోగులు



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి మంగళం: టీటీడీ చైర్మన్‌గా రెండోసారి భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు చేపట్టాక టీటీడీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని టీటీడీ ఉద్యోగ, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో టీటీడీ ఉద్యోగులు భూమన కరుణాకరరెడ్డికి దుశ్శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. మొదటి సారి టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి నియమితులైనప్పుడే ఎవ్వరికీ సాధ్యం కాని భక్తి చానల్, దళిత గోవిందం, శ్రీనివాస కల్యాణం తదితర అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. రెండో సారి టీటీడీ చైర్మన్‌గా నియమితులై టీటీడీ చరిత్రలో నిలిచిపోయేలా పాలకమండలిలో నిర్ణయాలు తీసుకున్న గొప్పవ్యక్తి కరుణాకరరెడ్డి అని కొనియాడారు. తిరుపతి ఇస్కాన్ రోడ్డు సమీపంలో టీటీడీ ఉద్యోగుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.7.50 కోట్లు మంజూరు చేస్తూ టీటీడీ పాలకమండలి సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. టెన్నిస్, షటిల్, కారమ్స్, స్విమ్మింగ్ పూల్, జిమ్, లాన్ టెన్నిస్ క్రీడలు ఆడేందుకు వీలుగా ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఉద్యోగులు తులసీ ప్రసాద్, వాసు, వెంకటరమణ, అనిల్, యశ్వంత్, క్రాంతి, వేణు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బలిజలంతా తరలిరండి...

- నేడు తిరుపతిలో బలిజల ఆత్మీయ సమావేశం
- ఏర్పాట్లు పరిశీలించిన బలిజ నేత ముద్రనారాయణ



బలిజల ఆత్మీయ సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: నగరంలో నిర్వహించనున్న బలిజల ఆత్మీయ సమావేశానికి బలిజలంతా తరలిరావాలని డిప్యూటీ మేయర్, బలిజ నేత ముద్రనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతిలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో పెద్ద ఎత్తున బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం బలిజ ఆత్మీయ సమావేశ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. తిరుపతిలో కులాలకు కాకుండా అభివృద్ధికి పట్టం కట్టడానికి గరంలోని బలిజలంతా ఒక్కటి అవుదామని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కులాలను అడ్డం పెట్టుకునే వాళ్లను కాకుండా కులమతాలకు తావు లేకుండా తిరుపతి నగర అభివృద్దే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి విజయానికి బలిజలంతా ఏకమవుదామన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్కే బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, బలిజ నాయకులు పాల్గొన్నారు.

వన్నెరెడ్లు భావితరాలకు ఆదర్శం కావాలి



ఐక్యత చాటుతున్న వన్నెరెడ్డి నేతలు, ఎమ్మెల్సీ, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: వన్నెరెడ్లు అన్ని రంగాలలో రాణిస్తూ సమాజ హితంలో భాగస్వాములై భావితరాలకు ఆదర్శం కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. వన్నెరెడ్డి సమన్వయ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం యూత్ హాస్టల్లో వన్నెరెడ్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వన్నె రెడ్డి కులస్తులు ఉమ్మడి చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా 15 లక్షల మంది ఉన్నారన్నారు. ఇప్పటికే రాజకీయపరంగా కొన్ని పదవులు పొందామని, భవిష్యత్తులో సైతం ఐక్యతతో ముందుకెళుతూ మరిన్ని పదవులు పొంది తద్వారా భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. వన్నెరెడ్డి కులస్తులు ఏకతాటిపై నిలిచి అభివృద్ధిపథంలో పయనించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. కోబాకు ధనంజయరెడ్డి, మునికృష్ణారెడ్డి, వెంకటమునిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మునిరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, వన్నెరెడ్డి కులస్తులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



వీఎస్ చంద్రశేఖర్ దంపతులకు సన్మానం

తిరుపతి(అలిపిరి): టీటీడీలో పదవీ విరమణ చేసిన ఏఈవో చిరంజీవులు, అసిస్టెంట్ షరాబు శంకర్ రెడ్డి, ఎలక్ట్రీషియన్ వీఎస్ చంద్రశేఖర్ గురువారం పదవీ విరమణ చేశారు. వీరిని టీటీడీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గంపల వెంకటరమణారెడ్డి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

రూ.39 లక్షలతో ఖబరస్థాన్ అభివృద్ధి

తిరుపతి తుడా: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మసీదు రోడ్డులో ముస్లింల శ్మశానవాటికను రూ.39 లక్షలతో ఆధునికీకరించారు. ఈ ఖబరస్థాన్‌ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గురువారం ప్రారంభించారు. మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ అదితి సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్, తిరుపతి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీలోనే ముస్లింలకు తగిన ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ముస్లిం పెద్దల విజ్ఞప్తి మేరకు షాదీ మహల్, పెద్ద మసీదు, మటన్ మార్కెట్లను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. రానున్న కాలంలో ముస్లింల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ రూ.39 లక్షలతో ముస్లింల శ్మశాన వాటికలో అవసరమైన షెడ్డును, కాంపౌండ్ గోడలు నిర్మించడం, ఆర్చి కూడిన షెడ్డును నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, మున్సిపల్ కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఖాదర్ బాషా, కార్పొరేటర్ నరేంద్ర, మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈఈ విజయకుమార్‌రెడ్డి, నాయకులు హాజి ఫరీద్, మౌలానా ఇబ్రహీమ్ హాస్మీ, ముఫ్తీ సమీవుల్లా, ఏటీజే మాలిక్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ చోటూ భాయ్, చానూ భాయ్, దినేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో కల్చరల్ ఫెస్ట్

తిరుపతి సిటీ : పద్మావతీ మహిళావర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి వర్సిటీలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. పండుగ వాతావరణంలో జరగనున్న ఈ కార్యక్రమానికి దేశంలో పలు విశ్వవిద్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా గురువారం వర్సిటీలో వీసీ డి భారతి ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను, బ్రోచర్లను, వెబ్‌సైట్‌ను, ఫెస్ట్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, కన్వీనర్ ఆర్ ప్రియదర్శినీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చర్చలు సఫలం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ పెద్దలతో వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతల చర్చలు సఫలీకృతమయ్యాయి. తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌తో గురువారం వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు అర్జునయ్య, నరసింహయాదవ్, షణ్ముగం తదితరులు సీనియారిటీ డ్యూటీ చార్ట్‌లపై చర్చించారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు వాటిని అమలు చేయడానికి నాలుగు రోజులు సమయం కోరారు. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన నేతలు శుక్రవారం నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను విరమించుకున్నారు. మార్చి 1వ తేదీ నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. అయితే గురువారం అధికారులతో నిర్వహించిన చర్చలు సఫలీకృతం కావడంతో సమ్మెను విరమిస్తున్నట్లు నేతలు వెల్లడించారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: నగరంలో ముస్లింల అభ్యున్నతికి, సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని, భవిష్యత్తులోనూ వారికి అండగా నిలుస్తానని డెప్యూటీ మేయర్, తిరుపతి నియోజకవర్గం సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. మసీదు రోడ్డులో ముస్లింల స్మశాన వాటికలో 38.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముస్లింల సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో 8 శాతం ముస్లింలకు అవకాశం కల్పించిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిదేనన్నారు. అవకాశం దొరికినప్పుడల్లా ముస్లింలను అక్కున చేర్చుకుంటూ వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. నగరంలోని షాదీమహల్ అభివృద్ధి, జీవకోనలోని ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధి, మటన్ మార్కెట్ తదితర పనులు చేపట్టి ముస్లింలకు చేయూతనిచ్చామన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. పరిశ్రమలు తెచ్చి తిరుపతిని ఐటీ కేంద్రంగా చేయడంతోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మేయర్ శిరీష, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్కే బాబు, కో–ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఎస్.ఖాదర్‌బాషా మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం, తిరుపతి అభివృద్ధికి శ్రమించడం భూమన కుటుంబానికే చెల్లిందన్నారు. నమ్మిన వారి ఆదరించే తత్వం కలిగిన నాయకుడు భూమన అభినయ్‌రెడ్డిని ఆశీర్వదించి మరింత అభివృద్ధిలో ముస్లింలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరంలోని మసీదుల మత పెద్దలు, ముత్తవల్లీలు, మైనారిటీ నేత ఇస్మాయిల్ సాహెబ్, గఫూర్, రబ్బానీ మసీద్ అధ్యక్షుడు ఫరీద్ సాహెబ్, రఫీ హిందుస్థానీ, మౌలానా, నూరుల్లా, మస్తానమ్మ, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ చోటాభాయ్, ముస్లింలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, హాజరైన ముస్లింలు

సర్వోత్తమరావు జీవితం ఆదర్శనీయం



వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కుసుమ కుమారి, శ్వేత డైరెక్టర్ భూమన్

తిరుపతి(అలిపిరి): గాడిచర్ల హరి సర్వోత్తమరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ ప్రొఫెసర్ కుసుమ కుమారి అన్నారు. గురువారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర కేంద్ర గ్రంథాలయం–పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో గాడిచర్ల సర్వోత్తమరావు 64వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాన్ని, వయోజన విద్య గొప్పతనాన్ని గురించి తెలియజేసిన గొప్ప వ్యక్తి హరి సర్వోత్తమరావు అని తెలిపారు. శ్వేత సంచాలకులు భూమన్ మాట్లాడుతూ గ్రంథాలయ విశిష్టత .. గాడిచర్ల ఔన్నత్యాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. రాజమండ్రికి చెందిన గౌతమీ గ్రంథాలయకర్త సన్నిధానం నరసింహశర్మ, ఎస్వీ యూనివర్సిటీ చరిత్ర విభాగం విశ్రాంత ఆచార్యులు రామచంద్రారెడ్డి, ఎస్వీ కేంద్ర గ్రంథాలయం, పరిశోధనా కేంద్రం అధికారి పుల్లారెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ మహిళా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే బలిజలపై టీడీపీ నేతల దాడి

- దాడి చేస్తే చూస్తూ ఊరుకోం ఖబడ్దార్
- టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో టీడీపీకి ఓటమి తప్పదన్న భయంతో వైఎస్సార్ సీపీ బలిజ నేతలపై టీడీపీ నేత నరసింహయాదవ్ తమ్ముడు కృష్ణయాదవ్ తదితరు దాడికి పాల్పడడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నేతలు పసుపులేటి సురేష్, జేసీఏ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బలిజ నేతలపై టీడీపీ నేతల దాడిని తీవ్రంగా ఖండించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బలిజలు ఆత్మీయ సదస్సుకు సన్నాహాలు చేస్తుంటే చూసి ఓర్వలేక దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. తిరుపతి నగర అభివృద్ధి చేపట్టడంతోపాటు కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న చరిత్ర భూమన కుటుంబానిదేనన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బలిజల అభ్యున్నతికి కాంక్షిస్తూ ఐక్యత చాటుతూ అభివృద్ధికి మార్గదర్శకుడైన అభినయ్‌రెడ్డికి మద్దతు ప్రకటించే దిశగా చర్చించేందుకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో అత్యధిక శాతం ఉన్న బలిజలు ఏకమైతే టీడీపీకి ఓటమి తప్పదనే ఆందోళనతో ఆ పార్టీ నేతలు కులం పేరుతో రెచ్చగొట్టి ఆందోళనలు రేకెత్తించే ప్రయత్నాలకు పాల్పడుతున్నారన్నారు. బలిజలపై దాడులు మానుకోవాలని మరోసారి ప్రయత్నిస్తే ఖబడ్దార్ కృష్ణయాదవ్ అంటూ వారు హెచ్చరించారు. బాధితుడు 3వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెంకటేష్ రాయల్ మాట్లాడుతూ వృత్తిపరంగా మెకానిక్‌గా పనిచేస్తూ వార్డు ప్రజల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. తన షాపులో మద్యం తాగకూడదని చెప్పినందుకు కులం పేరుతో దూషిస్తూ నీకు రాజకీయాలెందుకురా అంటూ టీడీపీ నేత కృష్ణయాదవ్ దాడికి దిగారన్నారు. కార్పొరేటర్ తమ్ముడు గణేష్, హరినాథరెడ్డి, అనిల్ రాయల్, ధనశేఖర్, సురేష్ రాయల్, వెంకటేష్‌రావు, కుమార్ రాయల్, సూరి రాయల్ పాల్గొన్నారు.

13న వాచీలు, మొబైల్ ఫోన్ల ఈ–వేలం

తిరుపతి (అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీలో భక్తులు కానుకగా సమర్పించిన వాచీలు, మొబైల్ ఫోన్లను మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు పోర్టల్‌లో ఈ– వేలం వేయనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆలివ్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్, ర్యాడో కంపెనీల వాచీలున్నాయి. ఐ ఫోన్లు, వివో, నోకియా, కార్బన్, శామ్‌సంగ్, మోటోరోలా, ఒప్పో కంపెనీల మొబైల్ ఫోన్లు వున్నాయి. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 23 లాట్లు, మొబైల్ ఫోన్లు 27 లాట్లు ఈ–వేలంలో ఉంచారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని.. 0877–2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.gov.in ను సంప్రదించగలరని కోరారు.

నేటి నుంచి శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



మూషిక వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవినాయక స్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఒకటవ తేదీ శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం మూషిక వాహనంపై శ్రీవినాయక స్వామివారు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత అర్చక పండితులు శాస్త్రబద్ధంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7.40 గంటలకు మీన లగ్నంలో చేపట్టే ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి హంస వాహన సేవ జరుగనుంది. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

తిరుపతి అర్బన్: ప్రపంచ బ్యాంక్ వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలోనూ ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించినట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ర్యాంప్‌లోని ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా ప్రభుత్వం పరిశ్రమల శాఖకు సర్వే నిర్వహిస్తోంది. దీంతో సేవా, వాణిజ్య రంగాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ సర్వే చేపట్టడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సర్వే ఉంటుందని వెల్లడించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్లు ఈ సర్వే పురోగతిని పరిశ్రమల శాఖ ద్వారా కలెక్టర్‌కు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈ డేటా బేస్‌లను అభివృద్ధి చేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడానికి సులువుగా ఉంటుందన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

తిరుపతి రూరల్: ఈ నెల 25న ఆదివారం పట్టపగలే శ్రీనివాస మంగాపురం– కాలూరు మధ్య ప్రధాన రహదారిపై కాబాల చంద్రశేఖర్‌రెడ్డి హత్య జరిగిన విషయం విదితమే. పాత కక్షల వల్లే తోడబుట్టిన అన్న తమ్ముడిని హత్య చేసినట్లు తిరుపతి రూరల్ పోలీసులు తేల్చారు. చంద్రశేఖర్‌రెడ్డి తన కుమారులకు ఆదివారం నారాయణ స్కూల్ వద్ద కలిసి వస్తుండగా దారిలో అటకాయించి అతి దారుణంగా హత్య చేశారు. తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటున్న రౌడీ షీటర్ రామ్మోహన్‌రెడ్డి ప్రధాన నిందితుడని తెలిపారు. ఇతనితోపాటు పురుషోత్తంరెడ్డి, యోగి, చింతకాయల వీధికి చెందిన ఓ బాలుడిని అరెస్టు చేసినట్టు తిరుపతి రూరల్ సీఐ తమీమ్‌అహ్మద్ తెలిపారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

క్లుప్తంగా

విదేశీ బృందం పర్యటన

చంద్రగిరి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానాలు, బోధనా పద్ధతులు బాగున్నాయని ఐటీ సిలబస్ కరికులం అంతర్జాతీయ ప్రతినిధులు తెలిపారు. గురువారం వారు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. అమెరికాకు చెందిన కరికులం రూపకల్పనలో సీనియర్ మేనేజర్ అయిన వెండి గ్రీన్, ఇంగ్లాండ్‌కు చెందిన పర్సనల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక అధికారి ఎరిక్ బాబర్‌లతో కూడిన విదేశీ బృందం ఈ పర్యటనలో పాల్గొంది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని ఐతేపల్లి పాఠశాలను సందర్శించారు. డిజిటల్ విద్య మౌలిక వసతులను పరిశీలించి బాగున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.లలితకుమారి, కె.భాస్కర్‌బాబు, కరికులం ఏపీ కోఆర్డినేటర్ వై.గిరిబాబుయాదవ్, ప్రధానోపాధ్యాయుడు ఆర్.మోహన్, అసిస్టెంట్ ఏఎంఓ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

తిరుపతి రూరల్: ఈ నెల 25న ఆదివారం పట్టపగలే శ్రీనివాస మంగాపురం– కాలూరు మధ్య ప్రధాన రహదారిపై కాబాల చంద్రశేఖర్‌రెడ్డి హత్య జరిగిన విషయం విదితమే. పాత కక్షల వల్లే తోడబుట్టిన అన్న తమ్ముడిని హత్య చేసినట్లు తిరుపతి రూరల్ పోలీసులు తేల్చారు. చంద్రశేఖర్‌రెడ్డి తన కుమారులకు ఆదివారం నారాయణ స్కూల్ వద్ద కలిసి వస్తుండగా దారిలో అటకాయించి అతి దారుణంగా హత్య చేశారు. తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటున్న రౌడీ షీటర్ రామ్మోహన్‌రెడ్డి ప్రధాన నిందితుడని తెలిపారు. ఇతనితోపాటు పురుషోత్తంరెడ్డి, యోగి, చింతకాయల వీధికి చెందిన ఓ బాలుడిని అరెస్టు చేసినట్టు తిరుపతి రూరల్ సీఐ తమీమ్‌అహ్మద్ తెలిపారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

తిరుపతి అర్బన్: ప్రపంచ బ్యాంక్ వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలోనూ ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించినట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ర్యాంప్‌లోని ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా ప్రభుత్వం పరిశ్రమల శాఖకు సర్వే నిర్వహిస్తోంది. దీంతో సేవా, వాణిజ్య రంగాలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ సర్వే చేపట్టడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు సర్వే ఉంటుందని వెల్లడించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్లు ఈ సర్వే పురోగతిని పరిశ్రమల శాఖ ద్వారా కలెక్టర్‌కు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈ డేటా బేస్‌లను అభివృద్ధి చేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడానికి సులువుగా ఉంటుందన్నారు.

13న వాచీలు, మొబైల్ ఫోన్ల ఈ-వేలం

తిరుపతి (అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీలో భక్తులు కానుకగా సమర్పించిన వాచీలు, మొబైల్ ఫోన్లను మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు పోర్టల్‌లో ఈ- వేలం వేయనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్ ట్రాక్, ర్యాడో కంపెనీల వాచీలున్నాయి. ఐ ఫోన్లు, వివో, నోకియా, కార్బన్, శామ్‌సంగ్, మోటోరోలా, ఒప్పో కంపెనీల మొబైల్ ఫోన్లు వున్నాయి. వాచీలు 23 లాట్లు, మొబైల్ ఫోన్లు 27 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యా లయాన్ని.. 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్ www. tirumala.org, రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ www. konugolu. ap.gov.in ను సంప్రదించగలరని కోరారు.

సర్వోత్తమరావు జీవితం ఆదర్శనీయం

తిరుపతి(అలిపిరి): గాడిచర్ల హరి సర్వోత్తమరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ ప్రొఫెసర్ కుసుమ కుమారి అన్నారు. గురువారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర కేంద్ర గ్రంథాలయం–పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో గాడిచర్ల సర్వోత్తమరావు 64వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్వేత సంచాలకులు భూమన్ మాట్లాడుతూ గ్రంథాలయ విశిష్టత .. గాడిచర్ల ఔన్నత్యాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయకర్త సన్నిధానం నరసింహశర్మ, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు రామచంద్రారెడ్డి, ఎస్వీ కేంద్ర గ్రంథాలయం అధికారి పుల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు చంద్రగిరి ఈఆర్‌వో, తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గంలో 16 పోలింగ్ స్టేషన్‌ల పేరు సవరణలు, 6 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పులు, 2 అనుబంధ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఒరవ కాలువ నిర్మాణం ఓ వరం

- 20 ఏళ్లుగా దుర్గంధంలో సప్తగిరికాలనీ వాసులు
- రూ.1.80కోట్లతో ఒరవకాలువ నిర్మాణం
- ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో సప్తగిరికాలనీవాసుల కల సాకారం
- చెవిరెడ్డికి రుణపడి ఉంటామంటున్న కాలనీ ప్రజలు



సప్తగిరికాలనీలో మురుగు పేరుకపోయి ఒరవకాలువ



రూ.1.80కోట్లతో నిర్మించిన ఒరవకాలువ

తిరుపతి మంగళం: కూలీనాలి చేసి పైసా పైసా కూడబెట్టి ఇళ్లు కట్టుకున్నారు.. అయితే ఇళ్ల ముందు దుర్గంధం. చెత్తాచెదారంతో ఏరులై పారుతున్న ఒరవ కాలువను నిర్మించుకోలేక దుర్గంధంలోనే సప్తగిరికాలనీ వాసులంతా జీవనం సాగించారు. చిన్నపాటి వర్షం వచ్చినా వరదనీటితో పాటు మురుగునీరు ఇళ్లల్లోకి చేరేవి. ఒరవకాలువ నుంచి వచ్చే దుర్గంధంతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడి నానా అవస్థలు పడేవారు. గత టీడీపీ పాలనలో అనేక సార్లు ఒరవ కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాయకులే లేరు. ఇరవయ్యేళ్లుగా సప్తగిరి కాలనీ వాసులు దుర్గంధంలోనే జీవనం సాగిస్తున్నా గత పాలకులెవ్వరూ పట్టించుకోలేదు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సప్తగిరికాలనీవాసులకు ఒరవ కాలువ నిర్మాణం చేపట్టి, వారికి వరాన్ని ప్రసాదించారు. సప్తగిరినగర్ గ్రామ పంచాయతీని నాలుగున్నరేళ్లల్లో రూ.8 కోట్లతో సీసీరోడ్లు, మురుగు కాలువలు, సచివాలయ భవనం, ఆర్వో వాటర్‌ప్లాంట్ తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకే దక్కిందని చెప్పవచ్చు.

దుర్గంధం నుంచి విముక్తి

అభివృద్ధి పనులే కాకుండా సప్తగిరికాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి రూ.1.80కోట్లు తుడా, మండల నిధులతో ఒరవకాలువ నిర్మించారు. దీంతో 20ఏళ్ల సప్తగిరికాలనీ వాసుల కల సాకారమైంది. సప్తగిరికాలనీ, అంబేద్కర్‌కాలనీ, వెంకటేశ్వర కాలనీ మీదుగా మంగళం –కరకంబాడి ప్రధాన మార్గం వరకు రూ.1.80 కోట్ల ఖర్చుతో ఈ కాలువను నిర్మించారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి లాంటి నాయకులు కావాలే తప్ప ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చి వెళ్లేవారు మాకొద్దు అని స్థానిక ప్రజలు అంటున్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యంత మెజారిటీతో గెలిపించుకుని తమ పంచాయతీలో చేసిన అభివృద్ధి, మేలుకు చెవిరెడ్డికి కానుకగా అందిస్తామని ప్రజలు చెబుతున్నారు.

దుర్గంధం భరించలేక పోయేవాళ్లం



ఇళ్ల ముందు దుర్గంధం వెదజల్లుతూ ఏరులా కాలువ ఎప్పుడూ పొంగిపొర్లుతూ ఉండేది. అందులో నుంచి వెదజల్లే వాసన, దోమలతో అనేక రోగాలతో మంచాన పడేవాళ్లం. చిన్నపాటి వర్షం వచ్చినా మురుగు నీరంతా ఇళ్లల్లోకి చేరేది. అందులో నుంచి పాములు, జెర్రెలు తదితర విషపురుగులు ఇళ్లల్లోకి వచ్చేవి. గతంలో మా గోడు ఎవ్వరికీ చెప్పినా పట్టించుకోలేదు. సప్తగిరి నగర్ పంచాయతీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డికి విన్నవించుకున్నాం. దీంతో ఆయన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఒరవ కాలువ నిర్మాణం చేపట్టారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలకు కాలనీ ప్రజలంతా జీవితాంతం రుణపడి ఉంటాం.

– నాగమ్మ, సప్తగిరికాలనీ

ఎమ్మెల్యే చెవిరెడ్డి మేలు మరువలేం



ఇరవయ్యేళ్లల్లో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా సప్తగిరినగర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారం, అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మేలు జీవితాంతం మరువలేం. ఒక పంచాయతీ అభివృద్ధికి పట్టేంత నిధులు రూ.1.80 కోట్లను కేవలం ఒరవకాలువ నిర్మాణానికి కేటాయించి మా సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన తండ్రీకొడుకులకు ఓట్లు తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. రాబోయే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మా బిడ్డగా భావించి ఆశీర్వదించి, వైఎస్సార్ సీపీని అత్యంత మెజారిటీతో గెలిపించుకుంటాం. మేలు చేసిన చెవిరెడ్డి కుటుంబాన్ని ఆదరిస్తాం.. మా గోడు పట్టించుకోని టీడీపీ వాళ్లను అదే ఒరవ కాలువలో తొక్కేస్తాం.

– వెంకటరెడ్డి, అంబేద్కర్‌కాలనీ

తండ్రికి తగ్గ తనయుడు



సప్తగిరికాలనీ ప్రజలు పడుతున్న సమస్యను ఎమ్మెల్యే చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి, తుడా చెర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లా. దాంతో వెంటనే వారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో ఒరవ కాలువ నిర్మాణం చేపట్టడానికి మోహిత్‌రెడ్డి స్వయంగా వచ్చి కాలువను పరిశీలించారు. దీంతో వెంటనే రూ.1.80కోట్లు తుడా, మండల నిధులను వెచ్చించి ఒరవకాలువ నిర్మించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తండ్రికి తగ్గ తనయుడిగా మోహిత్‌రెడ్డి పేరు సాధించారు. ప్రజా సమస్య అంటే క్షణమైనా ఆలోచించకుండా పరిష్కారానికి కృషి చేసే యువ నాయకుడు మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు పంచాయతీ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

– అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ ఇన్‌చార్జ్

శ్రీకోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో ఈ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. మార్చి 2, 9, 16, 23, 30వ తేదీల్లో శనివారాలు సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. ఈ నెల 10వ తేదీన అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభి షేకం చేపడుతారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ నిర్వహించనున్నారు. 19న పునర్వసు నక్షత్రం సందర్భగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీరామచంద్ర పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 25వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభి షేకం చేపడతారు. ఇదే రోజు సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థానం నిర్వహిస్తారు.

మహిళా వర్సిటీలో కల్చరల్ ఫెస్ట్



తిరుపతి సిటీ : పద్మావతీ మహిళావర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి వర్సిటీలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. పండుగ వాతావరణంలో జరగనున్న ఈ కార్యక్రమానికి దేశంలో పలు విశ్వవిద్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా గురువారం వర్సిటీలో వీసీ డి భారతి ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్లను, బ్రోచర్లను, వెబ్‌సైట్‌ను, ఫెస్ట్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, కన్వీనర్ ఆర్ ప్రియదర్శినీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు సరికాదు



పోలింగ్ బూత్‌పై వాస్తవాలను తెలుపుతున్న గ్రామస్తులు

ఫ్యాక్ట్ చెక్

పాకాల: తప్పుడు రాతలతో, తప్పుడు ప్రచారాలతో అబద్ధపు బతుకులతో జీవించడం టీడీపీకి సరికాదని పెద్దరామాపురం గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతిలో వెలువడిన ఎవరి కోసం మార్చారు అన్న శీర్షికను వారు తప్పుబట్టారు. ఏళ్ల తరబడి పెద్దరామాపురం గ్రామంలోనే ఎలక్షన్ బూత్ నిర్వహించే వారని, పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా ఏర్పాటు చేసి ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించే వారని పేర్కొన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో రిగ్గింగ్ చేసుకునేందుకు అనువుగా పెద్దరామాపురం పంచాయతీలోనే రెండు బూత్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఒక బూత్‌ను చిగరపల్లి గ్రామంలో, మరొక బూత్‌ను పెద్దరామాపురం గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేవారని తెలిపారు. ప్రజలకు అనుకూలంగా ఉన్న బూత్‌ను స్వార్థపూరితంగా మార్చింది టీడీపీ ప్రభుత్వమేనని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో పెద్దరామాపురం పంచాయతీలో గతంలో ఉన్న చిగరపల్లి గ్రామం బూతులో 1700కు పైగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అవాస్తవాలను రాశారని తెలిపారు. పెద్దరామాపురం పంచాయతీలో మొత్తం ఓట్ల సంఖ్య 1172 అయితే ఒక్క చిగరపల్లి బూత్‌కే 1700 ఓట్లు అని ఎలా రాస్తారని ప్రశ్నించారు. అంతే కాకుండా టాయిలెట్స్ లేవని, విద్యుత్ సౌకర్యం లేదని, తాగు నీటి సౌకర్యం లేదని పచ్చి అబద్దాలు రాయడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. పెద్దరామాపురం గ్రామంలో మెరుగైన, అన్ని వసతులతో కూడిన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలత, సచివాలయ కన్వీనర్, మాజీ సర్పంచ్ ఎస్.జయచంద్రారెడ్డి, పంచాయతీ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



పురుషుల మరుగుదొడ్లు



మహిళల మరుగుదొడ్లు

నేటి నుంచి శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఒకటవ తేదీ శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం మూషిక వాహనంపై శ్రీవినాయక స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత అర్చక పండితులు శాస్త్రబద్ధంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7.40 గంటలకు మీన లగ్నంలో చేపట్టే ధ్వజారోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి హంస వాహన సేవ జరుగనుంది. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



మూషిక వాహనంపై శ్రీవినాయక స్వామి

గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుడు గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరు గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి(80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మృతుడి గ్రామానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తిరుచానూరు మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, సర్పంచి అనసూయమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రిన్సిపల్, బ్యాంకు అధికారులు

పాకాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాసత్యపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్. సుభాష్ ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంపై 70 మంది విద్యార్థులకు పజిల్ పోటీలు నిర్వహించామని తెలిపారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా చిన్నతనం నుంచే వారి విద్యాభ్యాసంలో భాగంగా మంచి పొదుపు అలవాట్లు, డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా, చాలా ఆసక్తికరంగా కార్యక్రమంలో పాల్గొని అనేక విషయాలపై అవగాహన పొందారు. విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను కూడా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధిపతి డాక్టర్ మాసిలామణి, అధ్యాపకులు, బ్యాంకు అధికారులు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు
- భక్తులకు మినరల్ వాటర్
- వాహనాలు, దుకాణాలకు ఏర్పాటు



తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామివారి ఆలయం

తలకోన(భాకరాపేట): తలకోన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని హంగులతో సిద్ధం చేస్తున్నారు. మార్చి 5 మంగళవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లు ద్వారా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా తలకోన పవిత్ర జలపాతం(శిరోద్రోణం)లో స్నానాలు ఆచరించి వస్తారు. వచ్చిన వారు వచ్చినట్లే క్యూలైన్లలోకి నేరుగా వచ్చి శ్రీసిద్ధేశ్వరస్వామి, శ్రీ సిద్ధేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ఆలయం బయటికి వచ్చేలా ఏర్పాట్లు చేపట్టారు.

భక్తులకు మినరల్ వాటర్

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అందుబాటులో మినరల్ వాటర్‌ను దేవస్థానం, ఆర్‌డబ్ల్యూఎస్, నెరబైలు పంచాయతీ చేపట్టాయి. గతంలో వాటర్ ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ప్రస్తుతం భక్తులకు శుద్ధమైన నీటిని అందించే ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాహనాల పార్కింగ్, ప్రత్యేక దుకాణాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఆలయ ధర్మకర్తల మండలి, పోలీసు, దేవస్థానం ఆధ్వర్యంలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. అలాగే దుకాణాలను ఏర్పాటు చేసుకునే ప్రాంతాలను ఎంపిక చేశారు. దుకాణాలను పెట్టాలనుకునేవారు కచ్చితంగా ఆధార్‌కార్డు ఆలయ ఈవోకు అందజేయాలి. తరువాత పోలీసులకు అందజేయాల్సి ఉంటుంది. తరువాత దేవస్థానం, పోలీసులు కలిపి వాహనాలకు పాస్‌లు ఇస్తారు.

తాత్కాలిక కోనేరు

తలకోన జలపాతం వద్దకు వెళ్లలేని వారి కోసం, ఆలయం వద్ద తలనీలాలు సమర్పించే వారి కోసం ఆలయం ముందు భాగంలో జలపాతం నుంచి పారుతున్న నీటిని తాత్కాలికంగా మట్టితో పెద్ద కట్ట వేసి నింపారు. దీంతో జలపాతానికి వెళ్లలేని వారికి, సిద్ధపూజ సందర్భంగా వరపడే మహిళలకు సౌకర్యంగా ఉంటుంది.

మరుగుదొడ్లు ఏర్పాటు

తలకోనలో మరుగుదొడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉండేది. ఉన్న మరుగుదొడ్లు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. మరి కొన్ని ఏర్పాటు చేసేందుకు ఎంపీపీ చొరవ తీసుకుని ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

వీఐపీ పాస్‌లు రద్దు

ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం వీఐపీ పాస్‌లను శివరాత్రి సందర్భంగా రద్దు చేశారు. అలాగే వాహనాలకు కూడా పాస్‌లు చాలా తక్కువగా ఇస్తున్నామని దేవస్థానం తెలిపింది. 5వ తేదీ మంగళవారం ప్రారంభం అవుతున్న బ్రహ్మోత్సవ వేడుకలకు అన్ని రకాల హంగులతో ఆలయ ప్రాంగణం సిద్ధమైంది. భక్తులు కూడా ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధేశ్వర స్వామివారు

5 మంగళవారం నుండి 9వ తేదీ శనివారం వరకు తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా వైదిక స్మార్త ఆగమం ప్రకారం చేట్టనున్నారు. 8 శుక్రవారం మహా శివరాత్రి, మధ్యాహ్నం స్వామి అమ్మవార్ల కల్యాణం, 9 శనివారం సిద్ధపూజ కార్యక్రమాలు ఉంటాయి. ఈ రెండు రోజులు భారీగా వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు

పాకాల: చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లిలో కాబోయే దంపతులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. గురువారం స్థానిక నాయకుల చేతుల మీదుగా ఈ కానుకను అందజేశారు. కాబోయే నూతన దంపతులు ప్రతాపనేని జయశ్రీ, పి.పవన్‌కుమార్‌లకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, పట్టు బట్టలు, తిరుమల శ్రీవారి ప్రసాదంతోపాటు గ్రీటింగ్ కార్డును అందజేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో పెళ్లి కానుక అందజేయడం సంతోషకరమని, చాలా మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కలకాలం సంతోషంగా ఉండాలని కాబోయే వధూవరులను నాయకులు ఆశీర్వదించారు. సత్యచౌదరి, జీవ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను గురువారం ఆ పార్టీ నాయకులు అందజేశారు. స్థానిక చంద్రగిరి కొత్తపేట బజారువీధికి చెందిన ప్రసాద్ లీలావతి, శానంబట్ల పంచాయతీ కొత్తశానంబట్లకు చెందిన యామిని, శ్రీనివాసులురెడ్డి, అదే విధంగా తొండవాడ హరిజనవాడకు చెందిన నిరోష, సోమశేఖర్‌లకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మస్తాన్, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, మహార్ఘపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదంతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంజన్, యశోద, శంకర్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, నుస్రత్, బాహర్, రాము, పరశురాము, వంశీకృష్ణ, త్యాగరాజు, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.





శానంబట్లలో వివాహ కానుకను అందిస్తున్న నేతలు, చంద్రగిరిలో అందజేస్తున్న నాయకులు